
సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 15 । మార్చి । 2025



ప్రాణం తీసిన నిద్రమత్తు

ఎచ్చెర్ల సమీపంలో లారీని కారు ఢీకొట్టింది. తమిళనాడుకు చెందిన డ్రైవర్ మృతి చెందారు.


- 8లో



ఎస్ఎంసీ తీర్మానాలపై రగడ

ఎస్ఎంసీ తీర్మానాలపై రగడ జరుగుతోంది. వారి తీర్మానాలు వెనక్కి తీసుకునేలా కుట్ర జరుగుతోంది.

- 8లో



న్యూస్‌రీల్

20న తపాలా అదాలత్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు మార్చి 20న శ్రీకాకుళంలోని రెల్లవీధిలో ఉన్న తపాలాశాఖ సూపరింటెండెంట్ వారి కార్యాలయం వద్ద తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ అఫ్ పోస్ట్ ఆఫీస్ వి.హరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపా రు. తపాలా సేవలకు సంబంధించిన ప్రత్యేక వ్యక్తిగత ఫిర్యాదులు ఈ అదాలత్‌లో చర్చి స్తామని పేర్కొన్నారు. శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు మార్చి 20వ తేదీ లోగా 'తపాల అదాలత్' అనే శీర్షికతో వి హరిబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్–శ్రీకాకుళం 532001' అనే చిరునామాకు పంపించాలని సూచించారు. ఫిర్యాదులు వ్యక్తిగతంగా కూడా తీసుకొని అదాలత్‌కు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన విషయాలపై ఫిర్యాదులు తీసుకోబోమని స్పష్టం చేశారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో పాటు నిద్రిస్తున్న బీసీ సంక్షేమ అధికారి అనురాధ

నరసన్నపేట: జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అనురాధ తెలిపారు. స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో ఆమె గు రువారం రాత్రి బస చేశారు. శుక్రవారం ఉద యం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అంతకుముందు విద్యార్థుల దినచర్య పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బీసీ వసతి గృహాల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రిమ్స్ డ్యూటీ డాక్టర్ల భోజనంలో పురుగులు



మధ్యాహ్నం ఇచ్చిన భోజనంలో పురుగులు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్లకు సరఫరా చేస్తున్న భోజనంలో పురుగులు వచ్చాయి. శుక్రవారం మధ్యాహ్న భోజనంలో పురుగులు రాగా, రాత్రికి మంచి ఆహారం వస్తుందని వైద్యులు భావించారు. రాత్రి భోజనంలో కూడా పురుగులు కనిపించడంతో డాక్టర్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. భోజనాలు మానేసి విధులు నిర్వహించారు. రిమ్స్‌లో విధులు నిర్వహించే డాక్టర్లకు ప్రభుత్వ పరంగా ఆహారాన్ని సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షకీల వద్ద ప్రస్తావించగా తాను మధ్యాహ్నం సమయంలో ఇక్కడే భోజనం చేస్తున్నానని, పురుగులు తన ఆహారంలో లేవన్నారు. ఇటీవలి కలెక్టర్ కూడా ఆస్పత్రిని తనిఖీ చేసిన సమయంలో భోజనాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటామని స్పష్టం చేశారు.



మన నిశ్శబ్దమే.. శత్రువు

సెల్‌ఫోన్ కొన్నారు.. కొన్నాళ్లకే రిపేరుకు వచ్చింది. మౌనంగా ఉండిపోకండి. ఆ మౌనమే మోసానికి ప్రోత్సాహం.

పండ్లు కొన్నారు.. కొలతలో తేడా తెలుస్తోంది. నిశ్శబ్దంగా ఉండిపోకండి. ఆ నిశ్శబ్దమే హక్కులకు మరణశాసనం.

వస్తువులు కొన్నారు.. ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నాడు. మనకెందుకులే అనుకోకండి. ఆ నిర్లిప్తతే అక్రమాలకు అసలు కారణం.

డబ్బులు ఖర్చు పెడుతున్నప్పుడు దానికి తగ్గట్టు సేవలు పొందే అధికారం అందరికీ ఉంది. డబ్బుకు తగ్గ వస్తువు లేదా సేవ అందనప్పుడు మీ హక్కుకు భంగం వాటిల్లినట్టే. ఆ హక్కులను కాపాడేందుకే ఏటా ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహిస్తారు. ఈ హక్కులు కాపాడేందుకు ఓ పెద్ద వ్యవస్థే నడుస్తోంది. మనం చేయాల్సిందల్లా దానిపై అవగాహన పెంచుకోవడమే.

– శ్రీకాకుళం పీఎన్ కాలనీ, శ్రీకాకుళం పాతబస్టాండ్, శ్రీకాకుళం,అరసవల్లి, టెక్కలి, శ్రీకాకుళం కల్చరల్




నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

తెలుసుకో హక్కు.. చట్టమే దిక్కు

- జిల్లాలో విచ్చలవిడిగా తూకాల్లో మోసాలు.. కొలతల్లో తేడాలు
- మోసపోతున్న కొనుగోలుదారులు
- హక్కులపై అవగాహన పెంచుకోవాలంటున్న నిపుణులు

తూకాల్లో తేడాలు, ధరల్లో వ్యత్యాసాలు, నాణ్యతలో మార్పులు.. కొనుగోలుదారుడు అనునిత్యం మోసపోతున్నాడు. చిన్న పాన్‌షాపు మొదలకుని పెద్ద షోరూమ్ వరకు జిల్లాలో ఈ తరహా మోసాలు లెక్కకు మిక్కిలి జరుగుతున్నాయి. కానీ కొందరు మాత్రమే గుర్తించగలుగుతున్నారు. ఇలా మోసపోతున్న వారికి అండగా నిలిచేందుకు వినియోగదారుల రక్షణ చట్టం అంటూ ఒకటుంది. దీన్ని 1986లోనే ఏర్పాటు చేశారు. 2019లో కొత్త చట్టం కూడా వచ్చింది. దీని ప్రకారం మనం నిత్య జీవితంలో ప్రతి వస్తువు, సేవలు, కొనుగోలు, పొందడంలో ఎక్కడ లోపం, మోసం ఉన్నా వెంటనే వినియోగదారులు ఫోరం ద్వారా నష్టపోయిన వాటిని పొందవచ్చు. జిల్లాలో చాలా మంది ఈ ఫోరాన్ని ఆశ్రయించి న్యాయం పొందారు. అలాగే జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో రక్షణ మండలిలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా వినియోగదారులకు రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

హక్కులు తెలుసుకో..



- వస్తువుల కొనుగోలు, వినియోగం విషయంలో వినియోగదారులకు కొన్ని రకాల హక్కులు ఉన్నాయి.
- వస్తువుల నాణ్యత, పనితీరు, సేవల గురించి పూర్తి సమాచారం పొందే హక్కు వినియోగదారులకు ఉంది.
- హక్కులు ఉల్లంఘిస్తే పరిష్కారం కోరే హక్కు వినియోగదారులకు ఉంది.
- తప్పుగా మార్కెట్ చేసే వస్తువులు, సేవల నుంచి రక్షణ కల్పించే హక్కు వినియోగదారులకు ఉంది.
- దేశంలో ఎక్కడ వస్తువు కొన్నా, ఎక్కడ సేవా లోపం ఉన్నా ఆ వినియోగదారుడు నివసించే ప్రదేశం, ఉద్యోగం చేసే జిల్లా పరిధిలో కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.
- నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్) మొబైల్ యాప్‌లో కూడా బాధితులు ఫిర్యాదు చేయవచ్చు.
- వస్తు సేవలతో పాటు బీమా పాలసీలు, చిట్‌ఫండ్‌లు, మ్యూచువల్ ఫండ్‌లు, సేవింగ్‌లు, బ్యాంకు బీమాలు, అలాగే స్కీంల విషయంలో మోసం, లేదా నిర్లక్ష్యం చేస్తే వినియోగదారులు ఫోరంలో ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చు.



నేషనల్ కన్స్యూమర్ హెల్ప్ లైన్ యాప్

ఇలా ఫిర్యాదు చేయాలి..

- 1915,1800114000 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమస్య చెబితే వారు జిల్లా స్థాయి కమిషన్‌కు తెలియజేస్తారు.
- వస్తువు కొనేటప్పుడు ఇన్‌వాయిస్‌లు, ఐడీలను కచ్చితంగా నిక్షిప్తం చేయాలి. ఫిర్యాదు సమయంలో అవే ఆధారాలు.
- ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయించినా, నాసిరకం ఉత్పత్తులు అంటగట్టి సేవా లోపానికి పాల్పడినా నేరుగా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసే విధంగా కేంద్ర మంత్రిత్వ శాఖ వెసులుబాటు కల్పించింది.
- వాట్సాప్ నంబర్ 88000 01915 లో మొదట హాయ్ అని టైప్ చేయాలి. అక్కడి సూచనల ఆధారంగా వివరాలు నమోదు చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుంది.

కోర్టు ఉంది



జిల్లాలో వినియోగదారుల సమాఖ్య (కోర్టు) ఉంది. ఈ కోర్టులో ప్రతి రోజు కేసుల విచారణ ఉంటుంది. ఈ ఫోరంలో నేరుగా బాధితుడు ఫిర్యాదు చేయవచ్చు. లేదా ఫోరం సభ్యులను ఆశ్రయించి వారి ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అందుబాటులో ఉన్న న్యాయవాది ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. దీనికి కేవలం నష్టం, ఇబ్బంది జరిగిందని రుజువులు ఉంటే చాలు. జిల్లాలో ప్రధానంగా వస్తు, సేవలకు సంబంధించి 107 కేసులు ఈ కోర్టులో ఉన్నాయి.

కస్టమరు.. గెలిచారు



ఫోరంను ఆశ్రయించా



2023లో ఓ మొబైల్ షోరూమ్‌లో రెండు ఫోన్లను మొత్తం రూ.20 వేలతో కొనుగోలు చేశాను. కొన్న నెల రోజుల్లోపే ఆ రెండు ఫోన్లు పాడైపోయాయి. షోరూమ్ వాళ్లను అడిగితే తమకు సంబంధం లేదన్నారు. దీంతో బిల్లులు, ఆధారాలతో సహా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాను. ఐదు నెలల్లోనే నాకు రెండు ఫోన్లకు నష్ట పరిహారంగా రూ.42 వేల వరకు కోర్టు ద్వారా వచ్చింది. ఎవరైనా నష్టపోతే నిరభ్యంతరంగా కోర్టును ఆశ్రయించవచ్చు.

– కె.శ్రీనివాసరావు, వైద్యశాఖ ఉద్యోగి

ఏసీ పోతే..

పొందూరు మండలంలోని గోరింట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గత ఏడాది ఏప్రిల్‌లో ఏసీ మిషన్‌ను రూ.32వేలకు కొన్నారు. వారం రోజులు తిరగక ముందే ఆ మిషన్‌పోయింది. దీంతో ఆయ న సర్వీసు సెంటర్‌కు, ఏసీ కొన్న దుకాణానికి చాలాసార్లు వెళ్లి చూశారు. నెలలు గడిచినా ఫలితం లేకపోవడంతో వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. విచారణ అనంతరం పాత ఏసీ స్థానంలో కొత్త ఏసీ ఇవ్వాలని, అన్ని ఖర్చులు కలిపి రూ.42వేలు చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది.

వినియోగదారుడికి ఉపశమనం



టెక్కలిలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఓ వినియోగదారుడికి విద్యుత్ సేవల్లో తీవ్రమైన జాప్యం కల్పించారు. అంతే కాకుండా ఆర్థికంగా, మానసికంగా వేధించారు. దీనిపై సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయిస్తే న్యాయం చేశారు.

– కె.కిశోర్, స.హ.చట్టం ప్రతినిధి, టెక్కలి

రెండుసార్లు గెలిచా..



2011లో ఓ బ్యాంకులో నేను వేసిన డిపాజిట్ సొమ్ము చెల్లించాల్సిన కాలం పూర్తయినా ఇవ్వకపోవడంతో శ్రీకాకుళం వినియోగదారుల ఫోరంలో అన్ని ఆధారాలతో కేసు వేసి నేనే వాదించాను. మూడు నెలల్లో నాకు నా రూ.లక్ష సొమ్ముతోపాటుగా బ్యాంకుకు 15శాతం వడ్డీ చెల్లించాలని చెప్పడంతో పాటు కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఇచ్చారు. అలాగే 2019లో నేను విజయనగరంలోని ఓ కొరియర్ సర్వీసులో ఒక అత్యవసర కవర్ పంపాను. అది వారికి చేరలేదు. అడిగితే నిర్లక్ష్యంగా జవాబు చెప్పారు. దీంతో విజయనగరం వినియోగదారుల ఫోరంలో కేసు వేశారు. దీంతో నిర్లక్ష్యానికి మూల్యంగా రూ.10వేలు చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. కోర్టు ఖర్చుల కోసం రూ.3వేలు ఇవ్వాలని సూచించింది. కానీ వారు ఇవ్వకపోవడంతో కోర్టు ధిక్కరణ కేసు వేశా.

– కొమ్మాజ్యోస్యుల వసంతకుమార్, శ్రీకాకుళం

మోసం గురూ...

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తూనికలు.. కొలతలు ఇతర అంశాలపై 'సాక్షి' శుక్రవారం క్షేత్ర పరిశీలన చేసింది. అందులో వినియోగదారులతో పాటు 'సాక్షి' ఆయా దుకాణాల్లో ప్రక్రియను పరిశీలించింది.



- టెక్కలి పాత బస్టాండ్‌లో ఓ కిరాణా దుకాణంలో పాత తరం తూకాలు, కొత్త తరం ఎలక్ట్రానిక్ తూకాలతో సామాన్లు విక్రయిస్తున్నారు. అయితే పాత తరం తూకాలకు వినియోగిస్తున్న గుండ్లు పూర్తిగా కాలపరిమితి దాటి ఉన్నాయి. 'సాక్షి' పరిశీలనలో భాగంగా కిలో వస్తువులకు సుమారుగా 100 నుంచి 150 గ్రాముల వరకు తేడా కనిపిస్తోంది. వీటితో పాటు మొదటి రకం గ్రేడ్ పేరుతో నాశిరకమైన నిత్యావసర సామగ్రిని అసలు ధరలకు అమ్మకాలు చేస్తున్నారు.
- టెక్కలిలో ఓ బంగారు దుకాణంలో అమ్మకాలు చేస్తున్న బంగారం, వెండి వస్తువుల విషయాన్ని పరిశీలించగా నాసిరకమైన వెండి వస్తువులకు అసలు ధరను వసూలు చేస్తున్నారు. అలాగే బంగారం బరువు తూచే క్రమంలో వినియోగిస్తున్న డిజిటల్ తూకాల్లో అంకెల గారడీ కనిపిస్తోంది.
- టెక్కలిలో ఓ మందుల దుకాణంలో ఓ వినియోగదారుడు కొన్ని రకాల మందులు కొనుగోలు చేశాడు. అయితే ఇంటికి వెళ్లి పరిశీలించగా అవి కాలం చెల్లినవిగా గుర్తించాడు. దీంతో ఆయా మందుల దుకాణదారుడి వద్దకు వెళ్లి నిలదీయగా వాటిని మార్పు చేసి కొత్త తేదీలతో ఉన్న మందులను ఇచ్చాడు.



ఎస్పీ కార్యాలయం పక్కన ద్రాక్ష పండ్లు కిలో కొనుగోలు చేసినప్పుడు తూకం ఇలా...

కొను'గోల్‌మాల్'



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కి సమీపంలో, ఎస్పీ కార్యాలయం పక్కన ఓ దుకాణం వద్ద కిలో నల్ల ద్రాక్షపండ్లు కొనుగోలు చేశాను. ధర రూ.150 తీసుకున్నారు. ఆ పండ్లను నెహ్రూ యువ కేంద్రానికి సమీపంలో ఓ దుకాణం వద్ద మళ్లీ తూకం వేయించాను. అక్కడ 840 గ్రాములు మాత్రమే ఉంది.

– సీహెచ్ రామకృష్ణ, ప్రొఫెసర్, ఏఎస్ఎన్‌కాలనీ, శ్రీకాకుళం నగరం



వాటినే వేరే షాపు వద్ద తూకం వేస్తే 840 గ్రాములు మాత్రమే చూపిస్తున్న దృశ్యం

కొలతలో తేడా..



ఏపీబీ కార్యాలయం బలగ వద్ద చేపల మార్కెట్‌లో కిలో న్నర రొయ్యలు కొన్నాను. కానీ తూకం తక్కువగా ఉన్నట్లు అనుమానం వచ్చింది. సమీపంలోగల ఓ చికెన్ షాపు వద్దకు వెళ్లి డిజిటల్ కాటాలో మళ్లీ తూయిస్తే 1.290 గ్రాములు ఉంది. ఇదేంటని అడిగితే నచ్చితే కొనండి అని సమాధానమిస్తున్నారు.

– ఎన్.శ్రీనివాసరావు, డీసీసీబీ కాలనీ, కొనుగోలుదారుడు

అధికారుల తనిఖీలు శూన్యం...



వినియోగదారులు దారుణంగా మోసపోతున్నప్పటికీ అధికార యంత్రాంగం పూర్తిగా నిద్రపోతోంది. వస్తువుల అమ్మకాల్లో మోసాలు జరుగుతున్నప్పటికీ కనీస తనిఖీలు చేయడం లేదు.

– చల్లా రామారావు, వినియోగదారుల సంఘాల అధ్యక్షుడు, టెక్కలి

వినియోగదారులకు రక్షణ



వినియోగదారుల రక్షణ చట్టం–2019 వచ్చిన తర్వాత వినియోగదారులకు మరింత రక్షణ పెరిగింది. ప్రతి వస్తువు, సేవలు, బీమా, ఫైనాన్సు సంస్థలు అన్నింటిలోనూ ఇది ఉపయోగపడుతుంది.

– బగాది రామమోహన్‌రావు, అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య

తనిఖీలు చేస్తున్నాం

తూకాల్లో మోసం జరిగినట్లు మా దృష్టికి వస్తే తప్పనిసరిగా అలాంటి వ్యాపారులపై చర్యలు తీసుకుంటున్నాం. వేయింగ్ మెషిన్స్ సీజ్ చేస్తున్నాం. తమకు సిబ్బంది తక్కువగా ఉండడంతో కొంచెం ఇబ్బందిపడుతున్నాం. తూకాల్లో మోసం జరిగితే 93981 53671 నంబర్‌ను సంప్రదించాలి.

– విశ్వేశ్వరరావు, ఏసీ, తూనికలు, కొలతల శాఖ

వసపలో ఏనుగుల గుంపు

వసప గ్రామం సమీపం వంశధార నదీ పరివాహక ప్రాంతంలో ఏనుగుల గుంపు శుక్రవారం తిష్ట వేసింది. వేసవి కావడంతో నదిలో సేద తీరుతూ మొక్కజొన్న, నువ్వు, చెరకు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గత మూడు రోజుల నుంచి ఏనుగుల గుంపు కడుము, కుంటిభద్ర, హంస గ్రామాల సమీప పొలాలు, తోటల్లో సంచరిస్తున్నాయి. ఏనుగుల గుంపు సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు, తహసీల్దార్ రవి చంద్ర తెలిపారు. -కొత్తూరు



వసపలో పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ఊరిపైన.. వర్ణాల వాన

ఊరిపైన వర్ణాల వాన కురిసింది. హోలీ సందర్భంగా ఊరూవాడా రంగుల్లో మునిగితేలాయి. డోలోత్సవాల్లో భాగంగా సముద్ర తీరాలు కళకళలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక దర్శనాలు జరిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / శ్రీకాకుళం/ గార



శ్రీకూర్మంలో సముద్ర స్నానాలు
జిల్లా కేంద్రంలో ఓ బాలుడి సందడి

నిబంధనలకు టాటా ▶ నేతలకు వాటా..

- మద్యం షాపుల్లో ఎమ్మార్పీకి మించి విక్రయాలు
- అడిగే నాథుడే కరువు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:



కుదిరితే వ్యాపారంలో వాటా.. లేదంటే నెలవారీ ముడుపులు.. జిల్లాలో ప్రస్తుతం నేతలు సాగిస్తున్న లిక్కర్ దందా ఇది. పాలకులే ప్రోత్సహిస్తున్నప్పుడు వ్యాపారులు ఆగుతారా.. ఇంకేముంది చెలరేగిపోతున్నారు. ఇప్పటికైతే మందు షాపుల్లో ఎమ్మార్పీ మీద రూ.10 అదనంగా వడ్డిస్తున్నారు. మందుబాబుల స్పందన చూసి మరింత పెంచనున్నారు. ముడుపులు చేతికి అందుతుండడంతో అధికారులు కూడా మౌనవ్రతం పాటిస్తున్నారు. మద్యం షాపులు అటు నేతలకు, ఇటు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ముఖ్యంగా పైసా పెట్టుబడి లేకుండా నియోజకవర్గ కీలక నేతలు ఆర్జిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన తీసుకుంటే మొట్టమొదట రాజాం నియోజకవర్గంలో ప్రారంభించారు. విభజన జిల్లాకొస్తే పలాస నియోజకవర్గంలో శ్రీకారం చుట్టారు. కొన్ని ఏరియాల్లో సిండికేట్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఎంతమంది సభ్యులుంటే అదనంగా మరో సభ్యుడిగా నియోజకవర్గ కీలక నేతను పరిగణించి, వచ్చిన ఆదాయాన్ని సమానంగా పంచుకునేలా బలవంతంగా ఒప్పందం చేయించారు. ఉదాహరణకు 10మంది వ్యాపారులు సిండికేట్ అయితే పదకొండో సభ్యుడిగా కీలక నేతను చేర్చుకున్నారు. అక్కడ వచ్చిన మొత్తం ఆదాయాన్ని 11మంది సమానంగా పంచుకునేలా నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో రాజాం నియోజకవర్గంలో తొలుత ఈ రకమైన ఒప్పందం జరిగింది. ఇప్పుడిది విభజన జిల్లాలో మొదలైంది. కాకపోతే, ఇక్కడ ఒక్కో దగ్గర ఒక్కోలా జరిగింది. కొన్నిచోట్ల రాజాం మాదిరిగా ఆ ప్రాంతంలోని వ్యాపారులంతా సిండికేటై, కీలక నేతను ఒక సిండికేట్ సభ్యుడిగా తీసుకుని ఆదాయాన్ని వాటాలేసుకున్నారు. కొన్ని చోట్ల షాపుల వారీగా కీలక నేతలకు వాటాలిచ్చారు.

ఉదాహరణకు ఒక షాపులో నలుగురు పార్టనర్లు ఉంటే ఐదో పార్టనర్‌గా కీలక నేతను చేర్చుకున్నారు. ఆ షాపులో వచ్చే ఆదాయాన్ని ఆ ఐదుగురు సమానంగా పంచుకునేలా ఒప్పందాలు జరిగాయి. ఒక్క పైసా పెట్టుబడి పెట్టకుండా ఆ కీలక నేతలు బిజినెస్‌లో పార్టనర్ లేదా సిండికేట్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఎక్కడైతే సిండికేట్‌లో కీలక నేతలు సభ్యులుగా లేరో షాపుల్లో పార్టనర్‌గా ఉండటం లేదో ఆ ఏరియాల్లోని షాపుల నుంచి నెలవారీ ముడుపులకు ఒప్పందాలు జరిగాయి. బిజినెస్ బట్టి ఒక్కో షాపు ద్వారా రూ.30వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకుంటున్నారు.

అధికారుల చోద్యం



ఎక్కడికక్కడ బెల్ట్‌షాపులు కన్పిస్తున్నా, ఎమ్మార్పీకి మించి విక్రయాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. నేతలకు మాదిరిగానే వారికి కూడా భారీగా ముడుపులు అందుతుండటంతో గాలికొదిలేశారు. దీంతో మందుబాబులు కుదేలైపోతున్నారు. పెంచిన ధరలకు కొనుగోలు చేసి దోపిడీకి గురవుతున్నారు.

అయాచిత లబ్ధి..

సిండికేట్‌లో సభ్యుడిగా, షాపుల్లో పార్టనర్‌గా, షాపుల్లో నెల వారీ ముడుపులతో లబ్ధి పొందుతున్నందున అక్రమాలకు గేట్లు ఎత్తేశారు. ఎమ్మార్పీకి మించి విక్రయాలతో పాటు విచ్చల విడిగా బెల్ట్ షాపులు పెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. ఫలితంగా జిల్లాలో వీధికొక బెల్ట్‌షాపులు పుట్టుకురావడమే కాకుండా ఎమ్మార్పీకి మించి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.

క్లుప్తంగా

మిగులు ధాన్యం కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మిగులు 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇచ్ఛాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల శాసన మండలి బడ్జెట్ సమావేశంలో సైతం తాను ధాన్యం విషయమై ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్లు గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం సేకరణ నిలిచి పోయిందని, ఇప్పటి వరకు 49,2000 మెట్రిక్ టన్నులు ప్రభుత్వం సేకరించిందని, మిగతా ధాన్యం ఎప్పుడు సేకరిస్తారంటూ ప్రశ్నించగా.. అధికార యంత్రాంగం స్పందించి 45000 మెట్రిక్ టన్నులు వరకు కొనుగోలు చేసిందన్నారు. ఇంకా సుమారు 60వేలు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందని చెప్పారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు స్పందించి రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని కోరారు.

ఉద్దానం విద్యార్థి ప్రతిభ


ప్రశంసాపత్రం, మెడల్ అందుకుంటున్న బొడ్డు షణ్ముఖరావు

కాశీబుగ్గ: దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ (ఐఎంఒ ఢిల్లీ) ప్రతిభా పరీక్షలో మందస మండలం నాతుపురం బొడ్లూరుకు చెందిన బొడ్డు షణ్ముఖరావు సత్తాచాటాడు. రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్వాహకుల చేతులమీదుగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాడు. షణ్ముఖరావు నాలుగో తరగతి వరకు స్వగ్రామంలోనే చదివాడు. అనంతరం ఏపీఆర్ఎస్ ప్రవేశ పరీక్ష రాసి గుంటూరు జిల్లా తాడికొండ గురుకులంలో సీటు సాధించి ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. విద్యార్థి ప్రతిభ పట్ల ఉపాధ్యాయులు దాసరి ఈశ్వరరావు, తల్లిదండ్రులు బొడ్డు జీవనరావు, మోహిని, గ్రామస్తులు చేశారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ మహాసభలు


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కృష్ణబాలాజీ

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని యూటీఎఫ్ కార్యాలయంలో వీజీకె మూర్తి సభాప్రాంగణం వద్ద శుక్రవారం భారత సంచార నిగమ్ లిమిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ 10వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఆలిండియా బీఎస్ఎన్ఎల్ ఈయూ ఉపాధ్యక్షురాలు కె.రమాదేవి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాగర్, కృష్ణబాలాజీలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. బీఎస్ఎన్ఎల్‌కు తక్షణమే 4జీ, 5జి ఎక్విప్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 2017 నుంచి పే రివిజన్, పెన్షన్ రివిజన్ అమలు చేయాలని కోరారు. అనంతరం 'బీఎస్ఎన్ఎల్ మనుగడ–ఉద్యోగుల కర్తవ్యాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీఎస్ఎన్ఎల్ ఈయూ జిల్లా అధ్యక్షునిగా మాతల గోవర్ధనరావు, కార్యదర్శిగా పోలాకి వెంకటరావు, కోశాధికారిగా జి.అరుణశ్రీతో పాటు 18 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు కె.శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ మర్రి నాయుడు, ఈయూ ప్రతినిధులు అభిమన్యు, ఆదినారాయణ, డి.శ్రీనివాసరావు, శివప్రసాద్, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మా ప్రమేయం లేకుండానే ఫిర్యాదు

టెక్కలి రూరల్: మండలంలోని పెద్దసాన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వ్యక్తి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడనే ఫిర్యాదు మేరకు డీఈఓ తిరుమల చైతన్య విచారణ చేపటిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయమై శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమకు తెలియకుండానే హెచ్ఎం ఫిర్యాదు చేశారని చెప్పారు. హెచ్ఎం, ఉపాధ్యాయుడి మధ్య వివాదం ఉండటం వల్లే ఇలా జరిగిందని తెలిపారు. ఈ వ్యవహారంలో పాఠశాలకు సంబంధం లేని ఓ మహిళ పాత్ర ఉందన్నారు. ఉన్నతధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శివాలయంలో చోరీ


రణస్థలం: పైడిభీమవరం శివాలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీ, ఎలక్ట్రికల్ యాంప్లిఫయర్ పట్టుకుపోయారు. శుక్రవారం జె.ఆర్.పురం పోలీసులు ఆలయాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎస్సై ఎస్. చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎంసీ తీర్మానాలపై రగడ

- బలవంతంగా వెనక్కు తీసుకునేలా కూటమి సర్కారు కుట్రలు
- ఛైర్మన్, గ్రామపెద్దలతో మంతనాలకు విద్యాశాఖ అధికారులు సిద్ధం
- తప్పుపడుతున్న విద్యా, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ప్రతినిధులు
- పాఠశాల విద్యను నిర్వీర్యం చేస్తున్నారని మండిపాటు


స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ తీర్మానం

లావేరు మండలం లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ కలెక్టర్‌కు రాసిన తీర్మానం కాపీ



బ్రిడ్జి, రోడ్ల దుస్థితిని వివరించి తరగతులు కొనసాగించాలని కోరుతూ తీర్మానించిన ఎస్ఎంసీ కమిటీ

శ్రీకాకుళం న్యూకాలనీ :

పాఠశాల విద్యను కూటమి ప్రభుత్వం గందరగోళానికి నెట్టేందుకు సరికొత్త కుట్రలకు తెర తీస్తోంది. తాము అనుకున్న కార్యాన్ని పూర్తిచేసేందుకు అధికారులనే అస్త్రాలుగా వాడుకోవాలని చూస్తోంది. పాఠశాల విద్యాకమిటీ(ఎస్ఎంసీ) ఇచ్చిన తీర్మానాలను వెనుక్కి తీసుకునేలా అధికారుల నుంచే ఒత్తిళ్లు చేసేలా కుయుక్తులకు తెరతీసింది. కార్పొరేట్ వ్యవస్థకు తలొగ్గి.. పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరిట దగా చేసేందుకు సిద్ధమౌతోంది. బలవంతంగా ప్రాథమిక పాఠశాల నుంచి 3,4,5 తరగతులను, ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి 6,7,8 తరగతులను దూరంతో సంబంధం లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా.. సమీప ఆవాస ప్రాంతాలకు తరలించడానికి సన్నాహాలు చేస్తోంది. అందుకోసం న్యాయపరమైన అడ్డంకులు లేకుండా గతంలో తమ పాఠశాలలోని ఉన్నత తరగతుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఇచ్చిన తీర్మానాలను వెనక్కి తీసుకోమని బలవంతం చేస్తోంది.

తీర్మానాలను ఏ మార్చేలా..

వాస్తవానికి 117 సవరణ జీవో ద్వారా కూటమి సర్కారు తీసుకొచ్చిన దుర్మార్గపు విద్యా సంస్కరణలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ మార్చి 1న రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) సమావేశాల్లో.. తమ పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని, పాఠశాలలోని ఉన్నత తరగతులు తరలించకూడదని పేర్కొంటూ ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. వాటిని అధికారులకు అందజేశారు. అయితే ఏయే కమిటీలు తరగతులను యథాతథంగా కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశాయో.. ఆయా పాఠశాల లేదా ఆవాస ప్రాంత విద్యా కమిటీ ఛైర్మన్, సభ్యులు, గ్రామ పెద్దలను ఈ రెండు మూడు రోజుల్లో ఎంఈఓ ఆఫీసులకు పిలిపించి తీర్మానాలను వెనక్కి తీసుకొని.. ప్రభుత్వ నిర్ణయాలకు అనుకూలంగా తీర్మానాలు ఇమ్మని ఒత్తిడి తీసుకురానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో అధికారుల ఒత్తిడికి తలొగ్గని పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలతో ఎమ్మెల్యే వద్దకు పంచాయితీ పెట్టి ఒప్పించే ప్రయత్నం చేయడానికి రూట్‌మ్యాప్ సిద్ధం చేసినట్లు తెలిసింది.

ఎమ్మెల్యేలు, అధికారుల అత్యుత్సాహం..

జిల్లాలో ఓ శాసనసభ్యుడికి సొంత ప్రైవేట్ పాఠశాల ఉండటంతో తన స్కూల్ అభివృద్ధి కోసం.. తెరవెనుక కుయుక్తులు పన్నుతున్నట్లు ఆ మండల పరిధిలోని ఉపాధ్యాయులు చెప్పుకుంటున్నారు. చాలామంది ఎమ్మెల్యేలు వారి బంధువులకు, స్నేహితులకు ప్రైవేటు పాఠశాలలు ఉండటం వల్ల ప్రభుత్వ పాఠశాలలను విచ్ఛిన్నం చేసే ఈ కుట్రలో భాగం కానున్నారని.. వారి వల్లే ప్రభుత్వ పాఠశాలలకు ఈ దుస్థితి పట్టిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, ఎంఈఓలు అత్యుత్సాహంతో ఉన్నత స్థాయి అధికారుల వద్ద మెప్పు కోసం నిబంధనలను పక్కనపెట్టి.. భారీగా ఉన్నత తరగతులను సమీప పాఠశాలలకు తరలిస్తున్నారు. ఇక్కడ స్థూలంగా గమనిస్తే (నేచురల్ బేరియర్స్) భౌగోళిక అడ్డంకులను అధికారులు అసలు పట్టించుకోవడం లేదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

తప్పుపడుతున్న విద్యావేత్తలు, తల్లిదండ్రులు..

ఓట్లేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు, పిల్లలకు న్యాయం చేయాల్సిన అధికారులు ఈ రకంగా వ్యవహరించడాన్ని విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు తప్పుపడుతున్నారు. మూడో తరగతి కోసం 2, 3 కిలోమీటర్లు., ఆరో తరగతి కోసం 5, 6 కిలోమీటర్లు తమ పిల్లలను ప్రతిరోజు బడికి ఎలా పంపించాలని, వారు ఎలా వెళ్తారని ప్రశ్నిస్తున్నారు. కార్పొరేట్‌కు తలొగ్గి తమ పిల్లలకు చదువును దూరం చేయాలనే దుర్మార్గపు ఆలోచనలను కూటమి సర్కారు వీడాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ తప్పుడు ఆలోచనలను విరమించుకోవాలని.. ప్రస్తుతం ఉన్న మాదిరిగానే పాఠశాలలను కొనసాగిస్తూ విద్య కొనసాగించాలని.. లేనిపక్షంలో న్యాయ పోరాటానికి సిద్ధమౌతామని హెచ్చరిస్తున్నారు. తీర్మానాల కోసం అధికారులు బలవంతంగా ఒత్తిడి తీసుకొస్తే వారిపై కూడా కేసులు పెడతామని స్పష్టం చేస్తున్నారు.

ఏప్రిల్ 25 నుంచి అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు


క్రికెట్ పిచ్ పనులను పరిశీలిస్తున్న సీఎంసీసీ ప్రతినిధులు

ఆమదాలవలస:

పట్టణంలో ఏప్రిల్ 25 నుంచి మే 25 వరకు అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు సీఎంసీసీ అధ్యక్షుడు తమ్మినేని విద్యాసాగర్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు కె.సుదర్శన్, కిరణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమదాలవలసలో టోర్నమెంట్ నిర్వహించనున్న మైదానాన్ని పరిశీలించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు అనువైన ఏర్పాట్లపై చర్చించారు. త్వరలో పూర్తిస్థాయిలో వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గంధం వేణు, సనపల మోహన సురేష్, కాత్ర సుధాకర్, నిమ్మగడ్డ శేషుకుమార్, సత్య బాల తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు!

- లారీని కారు ఢీకొట్టిన ఘటనలో తమిళనాడు వ్యక్తి మృతి
- జరజాం ఫ్లై ఓవర్ సమీపంలో ఘటన


మృతి చెందిన ఆకాష్ (ఫైల్)


ప్రమాదానికి గురైన కారు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని జరజాం జంక్షన్ ఫ్లై ఓవర్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న కారు ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగాక లారీ ఆపకుండా వెళ్లిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న కల్లుగీత కార్మికుడు వెంటనే స్థానికుల సాయంతో అత్యవసర విభాగాలకు ఫోన్ చేయడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. స్టీరింగ్ వద్ద ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అతని వద్ద లభించిన ఆధారాల మేరకు తమిళనాడు రాష్ట్రం అవడి పట్టణానికి చెందిన ఆకాష్ (29)గా గుర్తించారు. ఇతను ఎల్అండ్‌టీ పరిశ్రమలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు వచ్చాక ఫిర్యాదు స్వీకరించి కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై సక్క కృష్ణారావు తెలిపారు. అతివేగం, నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. కాగా, గత కొంత కాలంగా ఎచ్చెర్ల పరిధిలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

రణస్థలం: మండలంలోని కోష్ట ఫ్లై ఓవర్ సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో భిక్షాటన చేసుకుంటూ రోడ్లుపై తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 63099 90850, 6309990816 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

చెన్నైలో వలస మత్స్యకారుడు మృతి


శ్యాంసుందరరావు మృతదేహం

సోంపేట: మండలంలోని ఇస్కలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు సీరాపు శ్యాంసుందరరావు(38) చెన్నైలో చేపల వేట సాగిస్తూ మృతిచెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..శ్యాంసుందరరావు నెల రోజుల కిందట చెన్నై వలస వెళ్లాడు. సముద్రంలో చేపల వేట సాగిస్తుండగా ప్రమాదవశాత్తు బోటు బోల్తాపడటంతో శుక్రవారం మృతి చెందాడు. శ్యాంసుందరరావుకు భార్య భానుమతి, కుమారుడు కుమారస్వామి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

లిఫ్ట్ ఇస్తానని చెప్పి..

టెక్కలి రూరల్: మండలంలోని మోదుగువలస గ్రామానికి చెందిన ఓ దివ్యాంగురాలు బైక్ పైనుంచి పడి తీవ్రగాయాలకు గురైన విషయం తెలిసిందే. అయితే బాధితురాలు ఈ ఘటన ఎలా జరిగిందనే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను గ్రామం వద్ద రోడ్డుపై నిల్చుని ఉండగా పక్క గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఎక్కడికి వెళ్తున్నావని అడిగాడని, టెక్కలి జిల్లా ఆసుపత్రికని చెప్పడంతో తానూ అక్కడికే వెలుతున్నానంటూ బైక్ ఎక్కించుకున్నాడని పేర్కొంది. మార్గమధ్యలో గూడెం వైపు తీసుకెళ్తుండటంతో ఆపమని చెప్పినా వినలేదని, అందుకే గెంతేశానని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాన్నా క్షమించు..

- మీకు భారం కాలేను
- పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య


హరికృష్ణ(ఫైల్)

నందిగాం: 'సారీ నాన్న.. నాకెంతో చేశారు.. నేను కొంచెం కూడా మీకు ఉపయోగపడలేదు. ఇంత వయస్సు వచ్చినా మీకు సహాయం కాకుండా నేను ఉన్నాను. యూజ్‌లెస్‌గా ఉండటం కంటే మీకు దూరంగా ఉంటేనే కరెక్టని నాకు అనిపించింది. మిమ్మల్ని కష్టపెట్టాలనినాకు లేదు..' అని వాట్సాప్ డీపీలో మెసేజ్ పెట్టి ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన నందిగాం మండలం ఆనందపురం ఊర చెరువు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరికి చెందిన ఇచ్ఛాపురం హరికృష్ణ(24) విజయనగరంలో వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకునేవాడు. 15 రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం విజయనగరం వెళ్తాను డబ్బులు ఇవ్వు అని తల్లిని అడిగాడు. కొద్ది రోజుల్లో ఇంటి సంబరం ఉందని, అదయ్యాక వెళ్లు అని చెప్పి రూ.550 ఇచ్చింది. డబ్బులు తీసుకొని బయటకు వెళ్లిన హరికృష్ణ పురుగుల మందు కొని ఆనందపురం చెరువు వద్దకు వెళ్లి తాగాడు. అనంతరం తన గ్రామానికి చెందిన స్నేహితుడు మామిడి విజయ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో విజయ్ కుటుంబసభ్యులకు, గ్రామస్తులకు తెలియజేసి ఆనందపురం వెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న హరికృష్ణను పలాసలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం మెడికవర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు రిమ్స్‌కు తరలించారు. మృతుడి తల్లి ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై షేక్‌మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చదువులో మంచి ప్రతిభ కనబరిచే హరికృష్ణ ఇలా అర్ధంతరంగా తనువు చాలించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పెళ్లి వేడుకకు లైటింగ్ కడుతూ..

- విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి
- ఎర్రన్నపేటలో విషాదచాయలు


మణికంఠ(ఫైల్)

జలుమూరు: మండలంలోని టి.లింగాలుపాడు పంచాయతీ ఎర్రన్నపేటకు చెందిన బలగ మణికంఠ(20) అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై శుక్రవారం ఉదయం మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మణికంఠతో పాటు కూన లక్ష్మణరావు, మెట్ట వికాస్‌లు జోనంకి పంచాయతీ అబ్బాయిపేటలో ఓ వివాహ వేడుకకు లైటింగ్ వైర్లు కట్టేందుకు వెళ్లారు. వైర్లు అమర్చుతుండగా అదే రోడ్డులో భారీగా వాహనం రావడంతో వాటిని తప్పించే క్రమంలో 11 కె.వి.లైన్ తాకడంతో వైర్లు పట్టుకున్న మణికంఠ షాక్‌కు గురయ్యాడు. వెంటనే నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతికందిన కుమారుడు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మణికంఠకు తల్లిదండ్రులు లచ్చన్న, కుమారి, తమ్ముడు జశ్వంత్ ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

రైలు ఢీకొని రిక్షా కార్మికుడు దుర్మరణం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో జరిగిన ప్రమాదంలో ఓ రిక్షా కార్మికుడు మృతిచెందాడు. బెల్లుపడ కాలనీకి చెందిన ఆసి బైరెడ్డి(50) ఎర్రచెరువు సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా అప్‌లైన్ ట్రాక్‌లో తిరుపతి–పూరి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని జీఆర్‌పీ ఎస్సై ఎస్‌కే షరీఫ్ తెలిపారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జీఆర్‌పీ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు



స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి


ధర్నా చేస్తున్న సంఘాల నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం వైఎస్సార్ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ప్రభుత్వం కేటాయించిన ప్యాకేజీ కేవలం అప్పులకే ఖర్చు చేయాలని ప్రకటించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ విధానాలను, అక్రమ తొలగింపులు ప్రశ్నిస్తున్న కార్మిక నేతలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమకు అండగా ఉంటారో కార్పొరేట్‌ల పక్షంలో ఉంటారో తేల్చుకోవాలన్నారు. నిరసన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఆర్.ప్రకాశరావు, కె.సూరయ్య, కె.కళ్యాణి, డి.సుదర్శనం, హైమ, కె.అప్పారావు, బి.సంతోష్, కె.శ్రీనివాస్, పవిత్ర, హరీష్, ఆర్.రమేష్, పి.దుర్గాప్రసాద్ ఏ.సత్యనారాయణ, రవికుమార్, బి.వాసుదేవరావు, పి.జగ్గారావు, జనార్దనరావు, ప్రవీణ, ఢిల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు


వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 160 కిలోల బరువు ఎత్తుతున్న ఆవల గోవిందరావు

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో శుక్రవారం జిల్లాస్థాయి బల ప్రదర్శన పోటీలు సందడిగా నిర్వహించారు. శ్రీ త్రినాథస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఏటా ఈ జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. 80 కిలోల విసురుగుండు పోటీలలో ఒప్పంగి గ్రామానికి చెందిన గేదెల సత్యనారాయణ ప్రథమ, ఆవల వసంతరావు ద్వితీయ బహుమతి పొందారు. అలాగే 100 కిలోల సంగిడి పోటీల్లో గేదెల సత్యనారాయణ, ఆవల గోవిందరావు మొదటి, ద్వితీయ బహుమతులు పొందారు. పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఆవల గోవిందరావు 160 కిలోలు ఎత్తి ప్రథమ, గుజ్జల ట్వింకిల్ కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో దూబ హేమశ్రీ 95 కిలోలు ఎత్తిడంతో ప్రథమ బహుమతి పొందగా తాలాడ కావ్య 80 కిలోలు ఎత్తి ద్వితీయ స్థానం సాధించారు. ఈ వెయిట్ లిఫ్టింగ్ పోటీలను పీడీ ఈశ్వరరావు, పవర్ వెయిట్ లిఫ్టింగ్ గౌరవ అధ్యక్షుడు బి.తిరుపతిరావు సమక్షంలో నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, బగ్గు అర్చన, మెండ రాంబాబు తదితరులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇప్పిలి ఆంజనేయ ప్రసాద్, ఇప్పిలి వేణులతో పాటు నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సంగిడి ఎత్తుతున్న గేదెల సత్యనారాయణ

వసూల్ రాజాలపై విజిలెన్స్

- డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలకాధికారులపై నిఘా
- సాక్షి కథనాలను ప్రామాణికంగా తీసుకుని విచారణ సాగిస్తున్న అధికారులు



ఈ నెల 5న సాక్షిలో ప్రచురితమైన కథనం


జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో కొన్నాళ్లుగా సాగుతున్న అవినీతి అక్రమాలతో పాటుగా తాజాగా మొదలైన వసూల్ రాజాల అక్రమాలపై 'విజిలెన్స్' ప్రత్యేక దృష్టి సారించింది. ఈ అంతర్గత వ్యవహారాలపై ఈ నెల 5న వైద్య శాఖలో వసూల్ రాజాల పేరిట 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. అందుకు అనుగుణంగా కార్యాలయంలో పరిస్థితులుండటంతో సంబంధిత అధికారులపై నిఘా ఉంచారు. ఇప్పటికే రెండుసార్లు డీఎంహెచ్ఓ కార్యాలయానికి చేరిన విజిలెన్స్ బృందానికి పరిపాలన విభాగం నుంచి ఎలాంటి సహకారం అందకపోవడంతో నేరుగా డీఎంహెచ్‌వో డాక్టర్ బాలమురళీకృష్ణతోనే మాట్లాడి పరిస్థితులను అడి గి తెలుసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు నివేదికను సిద్ధం చేయనున్నారు.

సాక్షిలో వరుస కథనాలు...

డీఎంహెచ్‌వో కార్యాలయంలో వరుసగా జరుగుతున్న పలు అక్రమాలపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం, అక్రమంగా రూ.లక్షల్లో వసూళ్లు చేయడంతో పాటు ఫేక్ జాయినింగ్ ఆర్డర్లు జారీ చేయడం వంటి అంశాలపై ఆధారాలతో సహా ప్రచురించిన సంగతి తెలిసిందే. వీటినే ప్రామాణికంగా తీసుకుని నిరుద్యోగ బాధితుల వివరాలతో పాటు అక్రమాలకు పాల్పడిన స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలక సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగుల తీరుపై చర్యలుండేలా విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఇప్పటికే చాలావరకు అక్రమాలతో పాటు ప్రస్తుతం ఏళ్ల నాటి నుంచి పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల విద్యార్హత సర్టిఫికెట్లు కూడా ఫేక్ అనే కథనాలు రావడంతో దీనిపైన కూడా విజిలెన్స్ దృష్టి పెట్టింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఇచ్చేసినట్లుగా ఆర్డర్లు జారీ చేయడంతో పాటు ఫోర్జరీ సంతకాలతో ఆన్‌లైన్‌లో జీతాలను జమ చేయడాన్ని విజిలెన్స్ అధికారులకు ఆశ్చర్యాన్ని కల్పించినట్లు సమాచారం. గత నెలలో విశాఖ డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు చేపట్టిన విచారణాంశాలను కూడా విజిలెన్స్ అధికారులు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. త్వరలోనే అక్రమాలు, వసూల్ రాజాల బండారాలను విజిలెన్స్ అధికారులు ప్రత్యేక నివేదిక ద్వారా ప్రభుత్వానికి పంపించేలా సన్నద్ధమవుతున్నారు. దీంతో రెండు రోజులుగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో స్తబ్దత నెలకొందరు. కొందరు లాంగ్‌లీవ్‌లో వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది.